# సాక్షి తిరుపతి

మంగళవారం : 23 : జనవరి : 2024






## బ్రాహ్మణపట్టు అభివృద్ధికి మెట్టు

తిరుపతి రూరల్ మండలంలోని బ్రాహ్మణపట్టు అభివృద్ధికి తొలి మెట్టు అని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. - 10లో



## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నాయుడుపేట: మహారాష్ట్ర పూణేలో ఈనెల 30న జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు నాయుడుపేటకు చెందిన లోకేష్ ఎంపికయ్యారు.



## జిల్లా ఓటర్లు 17,79,058

తిరుపతి జిల్లాలో మొత్తం 17,79,058 మంది ఓటర్లు తేలారు. అందులో మహిళా ఓటర్లు 9,10,597 ఉన్నారు. - 10లో

## న్యూస్‌రీల్

### స్పందనకు 96 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

**తిరుపతి అర్బన్:** కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 96 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, కేపీ శ్రీనివాసులు, భవానీశంకర్ తదితరుల కలిసి అర్జీలు స్వీకరించినట్టు వెల్లడించారు. ఇందులో 75 అర్జీలు రెవెన్యూ సమస్యలకు చెందినవివని పేర్కొన్నారు. ఏర్పేడు మండలంలోని చిందేపల్లికి చెందిన కర్రెయ్య, చెంచయ్య, చిలకమ్మ, రామ్మూర్తి తదితరులకు జగనన్న లేఅవుట్‌లో భూములిచ్చినట్టు వెల్లడించారు. మొత్తం 11 మందికి రూ.1.3 కోట్లు విడుదల చేసినా సంబంధిత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగలేదన్నారు. ఆ మేరకు వారి సమస్య పరిష్కారం కోసం డీఆర్వో పెంచల కిషోర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

### నేడు వైఎస్సార్ ఆసరా

- వెంకటగిరిలో నాల్గో విడత కార్యక్రమం
- జిల్లాలో 3,19,049 మందికి రూ.298.67 కోట్ల వరకు లబ్ధి



జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ

**తిరుపతి అర్బన్:** వైఎస్సార్ ఆసరా నాల్గో విడతకు సర్వం సిద్ధమైంది. జిల్లా కార్యక్రమాన్ని మంగళవారం వెంకటగిరి అడ్డరోడ్డు క్రాస్ సమీపంలోని ఎంజేఆర్‌హాల్‌లో నిర్వహించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల పేద మహిళాలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరాకు పురుడుపోశారు. ఇప్పటికే మూడు విడతల్లో జిల్లాలో రూ.1,194.33 కోట్ల రుణాలు మాఫీ చేశారు. తాజాగా నాల్గో విడతలో 33,757 పొదుపు సంఘాలకు చెందిన 3,19,049 మంది అక్కచెల్లెమ్మలకు రూ.298.67 కోట్ల రుణాలను మాఫీ చేయనున్నారు.

### బాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి రూరల్:** ఎంతో రాజకీయ పరిజ్ఞానం, అనుభవం ఉందని చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నోరు విప్పితే అన్నీ అబద్ధాలేనని, ఆయన మాటలు విని మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు హితవు పలికారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసం ఎన్‌జేఆర్ భవనంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో మోసపూరిత మాటలు చెప్పి బాబు అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. పెన్నా నదిలో ఇసుక దోపిడీ, భూ కబ్జాలు, తెల్లరాయి అక్రమరవాణా తదితర ఆరోపణలు చేశారని, వీటిని నిరూపించాలని సవాల్ విసిరారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సైదాపురం మైనింగ్‌లో అవకతవకలు జరిగాయిని ఆరోపించి ఏమీ చేయలేకపోయారని తెలిపారు. సైదాపురంలో మైనింగ్ నడుపుతున్నది టీడీపీ సర్పంచ్ కృష్ణమరాజు కాదా..? అని ప్రశ్నించారు. జేసీఎస్ కన్వీనర్ పులిప్రసాద్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, నాయకులు ఆదిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

### పెంచలకోనలో ప్రత్యేక పూజలు



దీపాలు వెలిగించిన దేవస్థాన అధికారులు

**రాపూరు:** పెంచలకోనలో సోమవారం అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, దీపారాధన చేశారు. ఉదయం శ్రీవారి కల్యాణ మండపంలో గాలిపాళెం పీఠాధిపతి శ్రీహరిస్వామి ఆధ్వర్యంలో భజన, శ్రీరామచరిత్ర ఉపన్యాసం చేశారు. అనంతరం ఆలయాల్లో 108 దీపాలు వెలిగించారు.



ఊరేగింపులో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి



శ్రీకాళహస్తిలో రాములోరి చిత్రపటం ఊరేగింపు

# నిలువెల్లా.. రామ్‌లల్లా

ఆధ్యాత్మిక జిల్లా తిరుపతిలో రామనామం మార్మోగింది. 500 ఏళ్ల యావత్ భక్తజనం కల ఎట్టకేలకు నెరవేరింది. సోమవారం అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీల్లో ఆసక్తిగా తిలకించి పులకించింది. రామనామాన్ని జపిస్తూ ఆనందడోలికల్లో హోలలాడింది. జైశ్రీరామ్ నినాదాలు మిన్నంటించింది. ఓ రామ..నీనామమెంతో రుచిరా..! అంటూ ఆలయాల్లో భజనలు చేస్తూ ఉప్పొంగింది. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, శ్రీసీతారామలక్ష్మణ, హనుమంత వారి చిత్రపటాల ఊరేగింపులు చేస్తూ ఆనంద సాగరంలో మునిగితేలింది.

**తిరుపతి కల్చరల్:** జిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని భక్తులు పులకించిపోయారు. వాడవాడలా రామభజన మందిరాలలో శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక హోమాలు, విశేష పూజలు, సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం సాగించారు. రామభజనలతో శ్రీరాముని స్మరిస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. బాలరాముని ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని టీవీలు, బిగ్ స్క్రీన్ల ద్వారా తిలకించి పరవశించారు.

**పులకించిన తిరునగరి**

అయోధ్యలో శ్రీరామమందిరంతో పాటు బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఆధ్యాత్మిక తిరుగనరి పులకించింది. ప్రతి వీధిలో భజన మందిరాల వద్ద లైవ్ స్క్రీన్లు ఏర్పాటు చేసి అయోధ్య రామమందిరం ప్రారంభం, బాలరాముని విగ్రహప్రతిష్ఠ పుణ్యఘట్టాన్ని కనులారా వీక్షించి తరించారు. నగర పురవీధులలో రామభజనలు, శ్రీరామనామస్మరణను హోరెత్తించారు.

- నెహ్రూవీధి మార్వాడీలు వ్యాపారులు గోవిందరాజస్వామి పుష్కరిణి వద్ద ఉన్న వినాయకగుడి, స్విమ్స్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీరోడ్డు ప్రాంతాల్లో భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు.
- తీర్థకట్ట వీధిలో వ్యాపారులు నవారామ్‌మల్లి, ప్రకాష్, శ్యామ్‌సుందర్, బాబునాయుడు ఆధ్వర్యంలో రెండువేల మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.
- కపిలతీర్థం వద్ద అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నరసింహరావు, కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో గోపూజ, శ్రీసీతారాములకు పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.
- గోవింద సేవా మండలి ఆధ్వర్యంలో అలిపిరి వద్ద నున్న గోశాల వద్ద ప్రత్యేకంగా శ్రీసీతారాములకు పూజలు నిర్వహించి సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ఉదయం నుంచి భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. జగన్నాథం, రాజశేఖర్, గోపి, ప్రభాకర్, చంద్రమౌళి, రమణ పాల్గొన్నారు.
- బీజేపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఆవరణలో శ్రీరామచంద్రమూర్తికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. గంగమ్మ ఆలయ ఈవో మమత పాల్గొన్నారు.
- ఉల్లిపట్టెడరామాలయంలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆలయం వద్ద శ్రీసీతారామలక్ష్మణులకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తులు అన్నప్రసాదాలు వితరణ చేశారు. పార్టీ రాష్ట్ర నేత మణినాయుడు, నీరుగట్టు నరేష్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



పాకాలలో సీతారామ ఉత్సవ మూర్తులు

### జైశ్రీరామ్



జైశ్రీరామ్ నినాదాలు చేస్తున్న బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థులు

**చంద్రగిరి:** మండల వ్యాప్తంగా జైశ్రీరామ్ నినాదాలు హోరెత్తాయి. స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ కాషాయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. పాఠశాల నుంచి ఆర్‌ఎఫ్ రోడ్డు, కొత్తపేట, పాతపేట, బజారు వీధి మీదుగా టవర్‌క్లాక్ కూడలికి చేరుకున్నారు. అక్కడ మానవహారం చేపట్టి, టవర్‌క్లాక్ కూడలిలో ఏర్పాటు చేసిన భారీ శ్రీరామ ఫ్లెక్సీ వద్ద నినాదాలు చేశారు. పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



గూడూరులోని ఆలయంలో జైశ్రీరామ్ అక్షర మాల



వివిధ వేషధారణలలో కళాకారులు

### వేడుకగా మహాయజ్ఞం

అన్నమాచార్య కళామందిరంలో అన్నమయ్య సంకీర్తనల అఖండ మహాయజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభం సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా టీటీడీ పరిపాలనా భవనంలోని అన్నమ్మయ ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అన్నమాచార్య ప్రాజెక్టు వరకు కళాకారులు సంకీర్తనలు ఆలపిస్తూ మేళతాళాల, కళాకారుల వివిధ వేషధారనల మధ్య ఊరేగింపుగా శ్రీకోదండరామాలయ మాడవీధుల గుండా అన్నమాచార్య కళామందిరానికి చేరుకున్నారు. అక్కడ అన్నమయ్య సంకీర్తనల అఖండ మహాయజ్ఞం ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 11 గంటల వరకు 24 గంటల పాటు నిరంతరాయంగా కళాకారులు సంకీర్తనలను గానం చేయనున్నారు.



రామచంద్రపుష్కరిణి వద్ద హనుమాన్ చాలీసా పారాయణం



బాలరాముడి ప్రాణప్రతిష్ఠను స్క్రీన్‌పై వీక్షిస్తున్న భక్తులు

# వసతులు సమకూర్చబడి






చిల్లకూరు : వరగలిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ముఖ ద్వారం



కోట : ఆహ్లాదకరంగా ప్రభుత్వ పాఠశాల ఆవరణం

- నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

**చిల్లకూరు:** ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు పెద్దపెద్ద చదువులు చదివేలా వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. విద్యాసామగ్రి, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్ ఇలా.. ఒక్కటారెండా.. విద్యావ్యవస్థనే సమూలంగా మార్చేశారు. నాడు–నేడుతో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. శిథిలావస్థకు చేరిన బడులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కార్పొరేట్ తలదన్నేలా వసతులు సమకూర్చారు. విద్యార్థుల పౌష్టికాహారానికీ పెద్దపీట వేశారు. రోజుకో మెనూ ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. కాలానికి అనుగుణంగా 8వ తరగతి నుంచే ఆన్‌లైన్ క్లాస్‌లు, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. బిడ్డను బడికి పంపే ప్రతి తల్లికి అమ్మఒడి పేరుతో రూ.15 వేల వరకు బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నారు. దీనిపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో ఏటా విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



గూడూరు పట్టణంలో డిజిటల్ క్లాస్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

**గూడూరు నియోజకవర్గ సమాచారం**

| | |
|---|---|
| పాఠశాలలు | 395 |
| నాడు–నేడుకు ఎంపికైనవి | 299 |
| ఖర్చుచేసిన మొత్తం | 4,596.57 కోట్లు |
| ఉపాధ్యాయుల సంఖ్య | 1,482 |
| విద్యార్థుల సంఖ్య | 27,059 |
| 2018–19లో విద్యార్థుల సంఖ్య | 24,362 |

### నా బిడ్డలను ఇక్కడే చదివిస్తున్నా



సీఎం జగనన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాడు–నేడుతో అన్ని వసతులు సమకూర్చారు. చిల్లకూరు మండలం వరగలిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు తొలి విడతలోనే అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. దగ్గర్లోనే పోర్టు యాజమాన్యం నడిపే స్కూల్ ఉన్నప్పటికీ నా బిడ్డలిద్దర్నీ ఇక్కడే చదివిస్తున్నా.

– కావలి సతీష్, తల్లితండ్రుల కమిటీ చైర్మన్, వరగలి, చిల్లకూరు మండలం

### ఆహ్లాదకరంగా ఉంది



గతంలో బడి మొత్తం చెత్త, పిల్లలు కూర్చునేందుకు సరైన వసతి కూడా ఉండేది కాదు. అలాంటి బడిని నాడు – నేడు కింద ఎంపిక చేసి సమూలంగా మార్చేశారు. గోడలపై రంగు రంగుల బొమ్మలు వేశారు. విద్యార్థులకు మంచి భోజనం , పిల్లలు కూర్చునేందుకు అందమైన బెంచీలు, టీవీ ఏర్పాటు చేశారు. కథలతో కూడిన పాఠాలు చెప్పడం ఎంతో బాగుంది.

– ఎస్‌కే వాహిదాబీ, పారిచెర్లవారిపాళెం

### సాహసోపేత నిర్ణయం



నాడు–నేడు కింద పాఠశాలలను ఎంపిక చేసి, ఆపై కమిటీలు.. నిధులు విడుదల చేశారు. తల్లిదండ్రుల కమిటీల పర్యవేక్షణలోనే పనులు జరిగాయి. పనులు నాణ్యంగా చేస్తేనే బిల్లులు మంజూరు చేసేలా ఆదేశాలిచ్చారు. పాఠశాలలన్నీ కార్పొరేట్ స్థాయిలో మారాయి. ఇలాంటి మాదిరిగా ఎప్పుడూ.. ఎవ్వరూ చేయలేదు. సీఎం జగనన్న సాహసోపేత నిర్ణయం వల్లే విద్యార్థులు బాగుపడ్డారు.

– ఇంగిలాల నందిని, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, గొల్లపాళెం, వాకాడు మండలం

### మేనమామ మాదిరిగా..



గతంలో బడికి బిడ్డను పంపించాలంటే అన్నీ మా డబ్బుతోనే కొనిచ్చేవాళ్లం. సీఎం జగన్ మోహన్‌రెడ్డి వచ్చాక మా బిడ్డను బడికి పంపితే ఆయనే అమ్మఒడి ద్వారా మాకు డబ్బులు ఇస్తున్నారు. దీంతోపాటు పిల్లలకు యూనిఫాం, బ్యాగులు, బూట్లు, పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. అలాగే బడిలో టీవీ ఏర్పాటు చేసి దానిద్వారా పాఠాలు చెబుతున్నారు. బడిలో తినడానికి చిక్కీలు, రుచి కరమైన భోజనం పెడుతున్నారు. సీఎం జగనన్న మేనమామ మాదిరిగా మా బిడ్డలను చూసుకుంటున్నారు.

– విమల, కాశీపురం, వాకాడు మండలం

# పార్టీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట:** సాధారణ వ్యక్తిగా ఉన్న తనకు రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని, అందరినీ కలుపుకునిపోయి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి తనను ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మూడోసారి కూడా అవకాశం కల్పించారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్నారు. పార్టీని బలోపేతానికి ముఖ్యనేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానన్నారు. కుటుంబంలో చిన్నచిన్న కలహాలు సాధారణమేనని, వాటని సరిదిద్దుకునేందుకు అందిరినీ కలిసి మాట్లాడుతానన్నారు. అనంతరం ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రజలకు అభినందనలు తెలిపారు. మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, కామిరెడ్డి రాజారెడ్డి, ఈద రత్నశ్రీ, జలదంకి వెంకటక్రిష్ణారెడ్డి, గంధవల్లి సిద్ధయ్య, వేణుంబాక చంద్ర, పీ.హరిరెడ్డి, కె.జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వేతనాల పెంపునకు చర్యలు



ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

**తిరుపతి(అలిపిరి):** టీటీడీ శిల్ప కళాశాలలోని శిల్పులు, ఉద్యోగుల వేతనాల పెంపునకు చర్యలు తీసుకుంటామని తిరుపతి నగర సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన శిల్ప కళాశాలలోని విగ్రహాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ అధికారులతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. రుయా హాస్పిటల్ వర్కింగ్ కమిటీ బండ్ల చంద్రశేఖర్ రాయల్, క్రాకర్స్ అసోసియేషన్ భాస్కర్ రాయల్, జీవకోన సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

### స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

**రేణిగుంట :** స్కూల్ బస్సు కిందపడి ప్రమాదవశాత్తు ఓ చిన్నారి మృతిచెందిన సంఘటన శ్రీకాళహస్తి మండలం, కాపుగున్నేరి పంచాయతీ పరిధిలోని ఎంఎంసీ కండ్రిగలో సోమవారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం.. ఎంఎంసీ కండ్రిగకు చెందిన చిన్నకాటయ్య, ఆశా దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. సాయంత్రం స్కూల్ బస్సులో వచ్చిన కుమారుడిని ఇంటికి తీసుకొచ్చేందుకు తల్లి ఆశా బస్సు వద్దకు వెళ్లింది. అదే సమయంలో చిన్న కుమారుడు దేవాన్ష్(3) ఆమె వెనుక వెళ్లగా.. దాన్నిగుర్తించని బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బస్సును ముందుకు నడిపాడు. ఇదే క్రమంలో దేవాన్ష్ బస్సుకిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

### 28న సైనిక్ పాఠశాల పరీక్ష

**తిరుపతి అర్బన్:** అఖిలభారత సైనిక్ పాఠశాలల ప్రవేశ పరీక్ష ఈనెల 28వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మార్పును పరీక్ష రాస్తున్న విద్యార్థులు గుర్తించాలని ఆయన కోరారు.

# డ్యూయల్ డిగ్రీతో బంగారు భవిష్యత్తు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు



హాజరైన విద్యార్థులు

- ఇంటర్ తరువాత డిగ్రీ కోర్సుల మీద అవగాహన సదస్సు
- శ్రీకాళహస్తిలో కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ – 'సాక్షి' సంయుక్త ఆధ్వర్యంలో గమనం–గమ్యం

**శ్రీకాళహస్తి:** ఇంజినీరింగ్‌లో స్పెషలైజేషన్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఎంబీఏ ఆచార్యులు డాక్టర్ కేవీ రాజు అన్నారు. శ్రీకాళహస్తిలోని పుష్కరిణి సమీపంలో ఉన్న రాయలసీమ జూనియర్ కళాశాలలో సోమవారం కేఎల్ డీమ్డ్ యూనిర్శిటీ – సాక్షి సంయుక్త ఆధ్వర్యంలో 'గమ్యం–గమనం' అనే పేరుతో విద్యార్థులకు ఇంటర్ తర్వాత డిగ్రీ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ కళాశాల ఆచార్యులు డాక్టర్ కేవీ రాజు, డిప్యూటీ విభాగాధిపతి డాక్టర్ అనిల్‌కుమార్ లా కళాశాల నుంచి డాక్టర్ ఏ సుబ్రహ్మణ్యం డాక్టర్ వహీద్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఎంబీఏ ఆచార్యులు డాక్టర్ కేవీ రాజు మాట్లాడుతూ ఇంటర్ పూర్తిచేయబోతున్న విద్యార్థులు ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో ఏ, బీ, సీ మూడు ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. మొదట పది యూనివర్సిటీలను తర్వాత ఐదు యూనివర్సిటీలను ఆ తర్వాత మూడు యూనివర్సిటీలను ఎంపిక చేసుకుని కెరీర్‌ను నిర్దేశించుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్‌లో సీఈసీ పైనే మన జీవితం ఆధారపడి ఉండదని సీఈసీలో సీటు దొరకని పక్షంలో డ్యూయల్ కోర్సులు చేసే అవకాశం ఉందని తెలియజేశారు. సెమిస్టర్‌లో సీజీపీఏ 9 సాధించిన వారికి డ్యూయల్ కోర్సు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కేఎల్ యూనివర్సిటీలో శ్రీచైతన్య విద్యార్థిని ఇంజనీరింగ్‌లో జాయిన్ అయితే ఆ విద్యార్థినికి సీఈసీలో సీటు రాలేదనీ, ఆమెకు నచ్చజెప్పి మెకానికల్‌లో జాయిన్ చేశామని తెలిపారు. మొదటి సంవత్సరం మెకానికల్ చదివినప్పటికీ రెండో సంవత్సరం సీటు పొందిందన్నారు. ఇంజినీరింగ్ పూర్తిచేసే నాటికి ఆమెకు మెకానికల్ పేరుతో పట్టా వచ్చినప్పటికీ పట్టాలో మెకానికల్ సీఈసీ రెండు కోర్సులకు సంబంధించిన డ్యూయల్ పట్టా ఉండడంతో కియా ఇంటర్వ్యూలో ఆమెకు మొదటి ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తుచేశారు. జేఈఈ ఐఐటీ, నీట్‌లలో సీటు రాని విద్యార్థులు అక్కడే ఆగిపోకుండా మిగతా ఆప్షన్ల కోసం ప్రయత్నాలు చేయాలన్నారు. కేఎల్ యూనివర్సిటీలో శ్రీచైతన్య నుంచి వచ్చిన ఏడుగురు విద్యార్థినులు వార్షిక జీతం రూ.50 లక్షలతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కృత్రిమ మేధా, డేటా సైన్స్, రోబోటిక్, ఐటీ రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయన్నారు. బీఏ ఐఏఎస్ ఉప విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ కేఎల్ యూనివర్శిటీలో అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో కొలువులు పొందుతున్నారని తెలిపారు. సదస్సు ఉద్దేశ్యాన్ని మండపేట సాక్షి యూనిట్ మేనేజర్ విద్యార్థులకు వివరించారు. లో కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఆచార్యులు, శ్రీకాళహస్తిలోని రాయలసీమ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, ఆచార్యులు పాల్గొన్నారు.

#### ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపితే భవితకు బాట

నాలుగేళ్ల పాటు కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం నలబై ఏళ్ల భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. ప్రతిభావంతులకు వంద శాతం ఉపకార వేతనాలు అందిస్తున్నాం. ఒకసారి రెండు డిగ్రీలు చేసే సౌలభ్యం అందుబాటులో ఉంది. అదనపు నైపుణ్యాలు పెంచుకున్న ప్రతి విద్యార్థికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపితే భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు.

– డాక్టర్ వాహిద్, లా కళాశాల ఆచార్యులు

#### డిగ్రీ కోర్సులతో కూడా ఉజ్వల భవిష్యత్తు

కేఎల్ యునివర్శిటీలో ఇంజినీరింగ్ కోర్సులతో పాటు డిగ్రీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇంటర్ తరువాత ఎలాంటి కోర్సులు చేయాలో తగిన గుర్తింపు ఉన్న విద్యా సంస్థలు ఏమిటో విద్యార్థులు ముందుగా తెలుసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలి. కేఎల్ యూనివర్శిటీలో డిగ్రీ కోర్సుల గురించి, సదుపాయాలను నిపుణులు చక్కగా వివరించారు. ఇంటర్ తరువాత సరైన నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తు దెబ్బతింటుంది.

– డాక్టర్ సుబ్రమణ్యం, ఎల్ఎల్‌బీ విభాగం ఆచార్యులు

# బ్రాహ్మణపట్టు..అభివృద్ధికి తొలిమెట్టు!



బ్రాహ్మణపట్టులో ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ఆధునిక వసతులతో ఒకేచోట ప్రభుత్వ భవనాల సముదాయం
- గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, మహిళా స్వయం సహాయక సంఘ భవనం
- ప్రారంభించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**తిరుపతి రూరల్:** అధునాతన హంగులతో తిరుపతి రూరల్ మండలం, బ్రాహ్మణపట్టు గ్రామంలో రూపుదిద్దుకున్న ప్రభుత్వ భవనాల సముదాయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రశంసించారు. బ్రాహ్మణపట్టు గ్రామంలో రూ.కోటి నిధులతో ఒకే ప్రాంగణంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. గ్రామ సచివాలయ వ్యవస్థకు సంబంధించిన భవన సముదాయాలను ఇక్కడ నిర్మించారు. ఎకరా విస్తీర్ణంలో ఆహ్లాదకర వాతావరణంలో సచివాలయ భవనంతో పాటు ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, మహిళా స్వయం సహాయక సంఘ భవనాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమని కొనియాడారు. రూ.43 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.8 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.14 లక్షలతో మహిళా స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం జరిగినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారుల వివరాలను సచివాలయంలో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ–క్రాప్ ఎలా చేస్తున్నారని ఆర్బీకే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో డాక్టర్, సిబ్బందిని పలకరించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. వసతులపై ఆరా తీశారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో మాట్లాడారు.

#### అభివృద్ధికి దిక్సూచి చంద్రగిరి

సీఎం జగనన్న నాయకత్వంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని పల్లెలను అభివృద్ధికి దిక్సూచిలా తీర్చిదిద్దినట్లు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గతంలో అధికారుల వద్దకు వెళ్లేందుకు ఎంతో వ్యయప్రయాసలకు గురికావాల్సి వచ్చేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా జన్మభూమి కమిటీలు వంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా ప్రజల బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో చంద్రగిరి నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తోంది వెల్లడించారు. నిరిష్పుంగా సంక్షేమ పథకాలు అమలుకు సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. తిరుపతి రూరల్ ఎంపీపీ వేముల యశోద, సర్పంచ్ నాగజ్యోతి, మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీటీసీలు యోగానందరెడ్డి, ఇంద్రాణి, గ్రామ కమిటీ అధ్యక్షులు మునస్వామి రెడ్డి, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

### ట్రాక్టరు బోల్తా–డ్రైవర్ మృతి



మృతి చెందిన వెంకటయ్య

**బుచ్చినాయుడుకండ్రిగ:** ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని వేణుగోపాలపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని కుమ్మరవెంకటపురం గ్రామానికి చెందిన పాలేటి వెంకటయ్య (43) వేణుగోపాలపురం గ్రామానికి చెందిన రైతు గురప్పనాయుడు పంట పొలాల్లోని రాళ్లను బయటకు తీసుకురావడానికి ట్రాక్టరు బాడుగకు తీసుకెళ్లారు. పొలాల్లోని రాళ్లను బయటకు తీసి ట్రాక్టరు ట్రక్కులో వేసుకుని తరలిస్తుండగా అదుపు తప్పి తిరగబడింది. దీంతో వెంకటయ్య ట్రాక్టరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్టు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు.

### యువకుడి మృతదేహం లభ్యం

**కుప్పంరూరల్:** స్నేహితులతో కలిసి సరదాగా తెప్పపై చెరువులో విహారానికి వెళ్లి, గల్లంతైన సామగుట్టపల్లెకు చెందిన సంజయ్ (27) మృతదేహం సోమవారం లభ్యమైంది. అగ్నిమాపక సిబ్బంది, పోలీసు యంత్రాంగం రెండు రోజులుగా సంజయ్ మృతదేహం కోసం తీవ్రంగా గాలించారు. ఫలితం లేకపోయింది. అయితే సోమవారం అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక గాలి యంత్రాలతో చెరువు నీటిలోకి గాలిని పంపి, వెతుకులాట ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు మృతుడు సంజయ్ శవం పైకి తేలింది. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మృతుడు సంజయ్ అవివాహితుడు. స్నేహితులే సంజయ్‌ని హతమార్చి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కుప్పం సీఐ శ్రీధర్ తెలిపారు. మృతదేహం వెలికి తీతలో ఫైర్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, నరేష్, రామమూర్తి, కృష్ణయ్య, మణి, బాలకృష్ణ పాల్గొన్నారు.

# జిల్లా ఓటర్లు 17,79,058 మంది



ఓటర్ల తుది జాబితాను వెల్లడిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

నియోజకవర్గాల వారీగా తుది ఓటర్ల జాబితా

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పు | స్త్రీ | ట్రాన్స్ జెండర్లు | మొత్తం |
|---|---|---|---|---|---|
| గూడూరు | 294 | 1,16,982 | 1,23,371 | 35 | 2,40,388 |
| సూళ్లూరుపేట | 304 | 1,15,802 | 1,21,876 | 22 | 2,37,700 |
| వెంకటగిరి | 298 | 1,16,936 | 1,22,300 | 04 | 2,39,240 |
| చంద్రగిరి | 395 | 1,50,249 | 1,58,607 | 60 | 3,08,916 |
| తిరుపతి | 267 | 1,48,101 | 1,50,100 | 38 | 2,98,239 |
| శ్రీకాళహస్తి | 293 | 1,17,635 | 1,25,546 | 16 | 2,43,197 |
| సత్యవేడు | 279 | 1,02,568 | 1,08,797 | 13 | 2,11,378 |
| మొత్తం | 2130 | 8,68,273 | 9,10,597 | 188 | 17,79,058 |

**తిరుపతి అర్బన్:** ఓటర్ల తుదిజాబితా వచ్చేసింది. తిరుపతి జిల్లాలో మొత్తం 2024 జనవరి 22వ తేదీ వరకు 17,79,058 మంది ఓటర్లు తేలారు. అందులో మహిళా ఓటర్లు 9,10,597 ఉండగా.. పురుషులు 8,68,273 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లకు సంబంధించి 188 ఓట్లు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ప్రకటించారు. ఆ మేరకు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి తుది జాబితాను అందించారు. అర్హత ఉండి ఇప్పటికీ ఓటు నమోదు చేసుకోని వారికి మరో అవకాశం కల్పించడానికి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడమే కాకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులతోపాటు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌వోలు జోరుగా కసరత్తు చేస్తున్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు.

#### ఫిర్యాదులు పరిష్కరిస్తాం

రాజకీయ పార్టీల నేతలు ఇస్తున్న ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి, పరిష్కరిస్తున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన ఓటర్ల జాబితా అనంతరం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.

#### పారదర్శకంగా ఓటర్ల జాబితా

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాం. ఓవైపు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తుది ఓటర్ల జాబితాను తయారు చేశాం. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించాం. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుదిజాబితా సిద్ధం చేశాం.

–కె.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

### మరో సారి ఆశీర్వదించండి



విష్ణువర్ధనరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ

**చిల్లకూరు:** రాష్ట్రంలో పేదల ఆర్థికపరిపుష్టి కలిగేలా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో సారి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని, అందుకు ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ, ప్రభుత్వవిప్, మేరిగ మురళీధర్ నాయకులకు పిలుపునిచ్చారు. మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను సోమవారం వారి నివాసాలలో ఆయన కలుసుకుని రానున్న ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. తీర ప్రాంతంలోని మోమిడి, ఏరూరు, చింతవరం, బల్లవోలు గ్రామాలలో నాయకులను మండల పార్టీ కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డితో వెళ్లి కలుసుకున్నారు. ఆయన వెంట చిల్లకూరు వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు, చింతవరం మాజీ సర్పంచ్ బుర్లా విష్ణువర్ధనరెడ్డి, బల్లవోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మారంరెడ్డి అమరనాథ్‌రెడ్డి, దువ్వూరు చెంచుకిరణ్‌రెడ్డి ఉన్నారు.

### 3 నుంచి తిరుమలలో సనాతన సదస్సు



సమీక్షిస్తున్న జేఈవో సదాభార్గవి

**తిరుపతి(అలిపిరి):** తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జేఈవో సదా భార్గవి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి విశ్రాంతి భవనంలో సోమవారం ఆమె అధికారులతో సమీక్షించారు. తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులను ఆహ్వానించేందుకు ఆహ్వాన పత్రికలు, ధార్మిక కార్యక్రమాలపై బుక్ లెట్ రూపొందించాలన్నారు. సదస్సుకు విచ్చేసే స్వామీజీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, రవాణా సదుపాయాలను సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ నిర్వహించే ధర్మ ప్రచార కార్యక్రమాలపై వీడియో రూపొందించాలని ఎస్వీబీసీ సీఈవోను ఆదేశించారు. సనాతన ధార్మిక సదస్సును ఘనంగా నిర్వహించేందుకు లైజన్, నోడల్ అధికారులను నియమించాలన్నారు. అనంతరం సదస్సు నిర్వహణకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లను విభాగాల వారీగా జేఈవో సమీక్షించారు. వేదవిశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణిసదాశివమూర్తి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖకుమార్, డీపీపీ కార్యదర్శి సోమయాజులు, ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పీఆర్ ఆనందతీర్థాచార్యులు, కల్యాణం ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డెప్యూటీ ఈవో గోవిందరాజ, జీయం(ఐటీ) సందీప్ పాల్గొన్నారు.